జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 19 | జులై | 2025 ◆ పేజీలు : 5



## మెగా ఆధార్ క్యాంపులకు ప్రజల నుండి విశేష స్పందన

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 18, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల నిర్వహించిన ఆధార్ క్యాంపులకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 9 నుండి జూలై 17, వరకు నిర్వహించిన మెగా ఆధార్ క్యాంపుల్లో మొత్తం 6,159 మంది తమ ఆధార్ నమోదు, సవరణలు వంటి సేవలను పొందారని తెలిపారు. ఇందులో కలెక్టర్ కార్యాల యంలో నిర్వహించిన క్యాంప్ లో అత్యధికంగా 3,772 మంది, భద్రాచలం క్యాంప్ లో 801 మంది, ఇల్లందులో 714 మంది, మణుగూరులో 525 మంది, దమ్మపేటలో 347 మంది పాల్గొన్నారు అని తెలిపారు, అన్ని క్యాంపులకు కలిపి మొత్తం 3,500 ఫిర్యాదులు స్వీకరించబడి పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు, ప్రజలు ఇంకా ఆధార్ సవరణలు లేదా ఆధార్ ఆధారిత సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయాలంటే

మిగతా 2 లో...

- సింగరేణి ఎస్ అండ్ పిసి ఉద్యోగి నిర్వాకం
- ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్ ని అంటూ డాబులు
- విధులకు మాస్టర్లు పడి బ్యాంకుల చుట్టూ చక్కర్లు..
- బ్యాంకు సిబ్బందిపై ఒత్తిడి, లోన్ బ్రోకరేజ్ దందా..!
- 'రత్న'లా కుమార్' అక్రమ ప్రవర్తనపై ఆరోపణలు..?



## నేను సింగరేణిచే ఎంపికైన...
# బ్యాంక్ లైజనింగ్ ఆఫీసర్...

నేను సింగరేణిచే ఎంపికైన.. ప్రత్యేక బ్యాంక్ లైజనింగ్ ఆఫీసర్ ని. సంస్థ సిఎండి, డైరెక్టర్ పా నన్ను ఎంపిక చేశారు. మీరు నాకు సహకరించకుంటే మా సంస్థ ఉన్నతా అధికారులకు ఫిర్యాదు చేస్తాను.. ఆపై మీ బ్యాంకు నుండి మా ఉద్యోగుల ఖాతాలు తరలిపోతాయి అంటూ సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా కు చెందిన ఎస్ అండ్ పిసి ఉద్యోగి 'రత్న'లా కుమార్ ఇల్లందులోని బ్యాంకు సిబ్బందిపై ఒత్తిడిచేస్తూ..లోన్ బ్రోకరేజ్ దందా చేస్తున్నాడు. స్వతహాగా సింగరేణిలో పూర్తి స్థాయి ఉద్యోగిగా ఉన్న ఇతగాడు.. అనధికారికంగా లోన్ బ్రోకరేజ్ పనుల్లో పాలుపంచుకుంటున్నాడని ఆరోపణలు ఉన్నాయి.

2 లో..

◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



## మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: మంత్రి పొంగులేటి

- సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గానికి ఆయకట్టు నీరందిస్తాం
- గోదావరి ముంపు ప్రజలకు ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు
- ఇందిర మహిళా శక్తి సంబరాల్లో మంత్రి పొంగులేటి

బూర్గంపహాడ్, జూలై 18 (ప్రజా జ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక నియోజకవర్గంలో ప్రతి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇందిర మహిళా శక్తి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో

మిగతా 2 లో...

## విద్యార్థులకు వరి నాట్ల అనుభవం
# నేలతో నేస్తాలయ్యారు



2 లో...



2 లో..

## అనధికార నగదు...
# అధికారుల తడబాటు..!

● కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ఏసీబీ దాడులు కలకలం ● పాల్వంచ డివిజన్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు ● అన్ని విభాగాల శాఖల రికార్డులను తనిఖీ చేసిన అధికారులు ● రూ. 50 వేల అనధికార నగదు గుర్తింపు ● కమిషనర్ సుజాత అలసత్వంపై అనుమానాలు..?

## మెగా ఆధార్ క్యాంపుకు విశేష స్పందన

(మొదటి పేజీ తరువాయి...)

తమ మండలాల్లోని ఆధార్ సేవా కేంద్రాలను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు, ప్రస్తుతం దుమ్ముగూడెం, చర్ల, గుండాల, దమ్మపేట, మణుగూరు, భద్రాచలం, ఇల్లందు, టేకులపల్లి, ముల్కలపల్లి, అన్నపూరెడ్డిపల్లి, అశ్వాపురం పినపాక, కరకగూడెం, కొత్తగూడెం, పాల్వంచ , సుజాత్ నగర్, చంద్రుగొండ, జూలూరు పాడు, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి వంటి మండలాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు ,ఈ సేవలు పంచాయతీ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసులు ,స్కూల్ ఆధార్ టీంలు ద్వారా లభిస్తున్నాయని. కొన్ని మండలాల్లో త్వరలో ఆధార్ సేవలు ప్రారంభమవుతాయనీ తెలిపారు. స్కూల్ ఆధార్ టీమ్ కు సంబంధించి ఏవైనా వివరాలు కావాలంటే జిల్లా మేనేజర్ వంశీ (ఫోన్ నంబర్: 7331115024)ను సంప్రదించాలని తెలిపారు, ప్రజలకు విజ్ఞప్తి ఏమిటంటే – మీ ఆధార్ మీ హక్కు. అందుచేత అవసరమైన అప్డేట్లు తప్పనిసరిగా చేయించుకోవాలి అని ఆధార్ సేవలపై ఫిర్యాదులు, సలహాల కోసం యు ఐ డి ఏ ఐ హెల్ప్ లైన్ నంబర్ 1947 లేదా ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు ను కలెక్టరేట్ లో సంప్రదించవచ్చు అని కలెక్టర్ తెలిపారు .

## మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)

కలిసి మాట్లాడారు. మహిళా సంఘాలు వడ్డీలేని రుణాలు పొందడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లును చేయడమే తమ లక్ష్యమన్నారు. పినపాక నియోజకవర్గంలో 4500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మరో 1500 ఇందిరమ్మ ఇళ్లను అదనంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పెట్రోల్ బంకుల నిర్వహణ, సోలార్ యూనిట్ల నిర్వహణ, బస్సుల కొనుగోలు వంటి పథకాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పోడు రైతులను ఫారెస్టు అధికారులు ఇబ్బంది పెట్టొద్దని ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. సారపాకలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయించేలా అధికారులను మంత్రి ఆదేశించారు. దోమలపాడు ప్రాజెక్టు అభివృద్ధి కోసం నిధులు కేటాయించా లని గ్రామస్థులు మంత్రిని కోరగా తగు చర్యలు చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం బ్యాంకు లింకేజీ ద్వారా 19.18కోట్లు వడ్డీ లేని రుణాలకు సంబంధించి చెక్కు, 3341 సంఘాలకు రూ.3.26కోట్లు చెక్కు ను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, పినపాక తహశీల్దార్ నరేష్, బూర్గంపహాడ్ తహశీల్దార్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## నేను సింగరేణిచే ఎంపికైన.. బ్యాంక్ లైజనింగ్ ఆఫీసర్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 18, ప్రజాజ్యోతి ;** నేను సింగరేణిచే ఎంపికైన.. ప్రత్యేక బ్యాంక్ లైజనింగ్ ఆఫీసర్ ని. సంస్థ సిఎండి, డైరెక్టర్ పా నన్ను ఎంపిక చేశారు. మీరు నాకు సహకరించకుంటే మా సంస్థ ఉన్నతా అధికారులకు ఫిర్యాదు చేస్తాను.. ఆపై మీ బ్యాంకు నుండి మా ఉద్యోగుల ఖాతాలు తరలిపోతాయి అంటూ సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా కు చెందిన ఎస్ అండ్ పిసి ఉద్యోగి 'రత్న'లా కుమార్ ఇల్లందులోని బ్యాంకు సిబ్బందిపై ఒత్తిడిచేస్తూ..లోన్ బ్రోకరేజ్ దందా చేస్తున్నాడు. స్వతహాగా సింగరేణిలో పూర్తి స్థాయి ఉద్యోగిగా ఉన్న ఇతగాడు.. అనధికారికంగా లోన్ బ్రోకరేజ్ పనుల్లో పాలుపంచుకుంటున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగుల తరఫున లోన్లు ఇప్పించేందుకు బ్యాంకుల్లో మధ్యవర్తిగా వ్యవహరిస్తూ, అధిక వడ్డీ వ్యాపారాలకు తోడ్పడుతున్నట్లు సమాచారం. అయితే గత కొంత కాలంగా ఇతని తిరుపట్ల సిబ్బంది విసుగు చెందడంతో మనోడి మాటలు అక్కడ చెల్లుబాటు కావడం లేదు. ఈ పరిస్థితిని ఎలాగైనా ఛేదించాలని 'రత్న'లా కుమార్ కొత్త ఉపాయాన్ని కనుగొన్నాడు. అందులో భాగంగానే ఈ 'బ్యాంకు లైజనింగ్ ఆఫీసర్' అనే పదాన్ని తెరపైకి తెచ్చి డాబులు కొడుతున్నట్టు సమాచారం. అంతేకాకుండా, పని వేళల్లో సింగరేణిలో మాస్టర్లు వేసుకొని బ్యాంకుల చుట్టూ తిరుగుతూ లోన్ల కోసం లాబీయింగ్ చేసుకుంటున్నాడు. వాస్తవానికి సింగరేణి ఎస్ అండ్ పిసి విభాగం నుండి కొంతమంది సెక్యూరిటీ గార్డ్స్ సంస్థలోని వివిధ విభాగాలలో కొన్ని ప్రత్యేకమైన విధులు నిర్వహిస్తూ ఉంటారు. మొబైల్ టాస్క్ ఫోర్స్, యాంటీ కోల్ తెఫ్ట్, వెల్ఫేర్ అనుసంధానంగా క్వార్టర్ల పర్యవేక్షణ, ఎస్టేట్ అనుబంధంగా ఆస్తుల పరిరక్షణ లాంటివి ఉంటాయి. కానీ ఈ 'బ్యాంకు లైజనింగ్ ఆఫీసర్' అనేది సెక్యూరిటీ విభాగానికి సంబంధించి ఎలాంటి ప్రత్యేకమైన విధులు లేవు. ఈ అంశంపై ఆ శాఖకు సంబంధించిన ఓ అధికారిని ప్రజాజ్యోతి సంప్రదించగా ఇదే అంశాన్ని స్పష్టం చేశారు. ఇలాంటి వ్యక్తుల వల్ల సంస్థ కీర్తి మసకబారుతుందని అవేదన సైతం వెళ్లగక్కారు. దీంతో సంస్థలో కీలకమైన విభాగంలో పనిచేస్తూ ఇలాంటి పనులకు పాల్పడుతున్న ఇతనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మరి ఉద్యోగ నియమ నిబంధనలు, ప్రొఫెషనల్ ఎథిక్స్ ఉల్లంఘిస్తు ఇష్టారీతిన వ్యవహారిస్తున్న.. "ఎస్ అండ్ పిసి బ్యాంక్ లైజనింగ్ ఆఫీసర్" 'రత్న'లా కుమార్' ఆగడాలకు సంస్థ కళ్ళెం వేస్తుందా..?




# అనధికార నగదు... అధికారుల తడబాటు..!

**• కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ఏసీబీ దాడులు కలకలం • పాల్వంచ డివిజన్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు • అన్ని విభాగాల శాఖల రికార్డులను తనిఖీ చేసిన అధికారులు • రూ. 50 వేల అనధికార నగదు గుర్తింపు • కమిషనర్ సుజాత అలసత్వంపై అనుమానాలు..?**

**కొత్తగూడెం కలెక్టరేట్ / పాల్వంచ రూరల్ / పాల్వంచ టౌన్, జులై 18, ప్రజా జ్యోతి:** భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోగల పాల్వంచ డివిజన్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు శుక్రవరం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. పలువురు అధికారులపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఈ దాడుల సమయంలో అధికారులు ఆఫీసు రికార్డులను, లావాదేవీల డేటాను, పత్రాలను వివరంగా పరిశీలించారు. అనుమానాస్పద లావాదేవీలపై విచారణ సాగిస్తూ, సంబంధిత ఉద్యోగులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల జరిగిన పనుల కొలతలు, బిల్లుల విడుదల, పర్మిషన్లు మంజూరు అంశాలపై అధికారులు దృష్టిసారించారు. అయితే అందులో పలు అక్రమ లావాదేవీల ఆనవాళ్లు బయటపడే అవకాశం ఉందని విశ్వసనియవర్గాల సమాచారం. ఈ పరిశీలనలో భాగంగా ఏసీబీ అధికారులు రూ. 50,000/- విలువైన అనధికారిక నగదును స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా మున్సిపల్



పరిపాలనలో అవినీతికి సంబంధించి వస్తున్న ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం. అయితే ఈ దాడులు పాల్వంచ డివిజన్ లో మున్సిపల్ పరిపాలనపై నిలిచిన అవినీతి ఆరోపణలకు సంబంధించి కీలక మలుపుగా పాల్వంచ వాసులు పేర్కొంటున్నారు.

### కమిషనర్ సుజాత ప్రవర్తనపై అనుమానాలు

ఈ తనిఖీల సమాచారం ఉదయం 12 గంటల సమయంలోనే కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో ఓ పత్రికకు సంభందించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో భాగంగా కార్యాలయంలోనే ఉన్న కమిషనర్ సుజాతకు ఈ సమాచారం అందింది. అక్కడ నుండి ఆఘమేఘాలపై పాల్వంచకి బయలుదేరిన కమిషనర్ సాయంత్రం 5 గంటలకు పాల్వంచ కార్యాలయానికి చేరుకుంది. ఆ తదుపరి కమిషనర్ వద్ద నుండి ఎసిబి అధికారులు కొంత సమాచారం సేకరించి ఆమె చాంబర్ లో సోదలు నిర్వహించారు. అయితే కేవలం 15 నిమిషాల్లో చేరవలసిన దూరాన్ని, ఆమె 5 గంటలు ఆలస్యంగా చేరడంతో.. ఈ ఆలస్యపు ప్రయాణం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ సమయంలో ఆమె ఎక్కడికి వెళ్లిందో, ఎందుకు ఆలస్యం అయిందో ఇంకా స్పష్టత లేకపోవడం వల్ల, ఆమె ప్రవర్తనపై అధికారులు, స్థానిక రాజకీయ వర్గాలు, ప్రజల మధ్య చర్చ జరుగుతోంది. అయితే ఈ తనిఖీలు మున్సిపల్ పరిపాలన వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలపై స్పష్టమైన సంకేతాల్లా మారాయి. దీంతో భవన అనుమతులు, బిల్లుల క్లియరెన్సులు, ఫైల్ మేనేజ్ మెంట్, పర్మిషన్ మంజూరులో పారదర్శకత లోపించిందన్న అభిప్రాయాలు పట్టణ ప్రజలలో నెలకొంది. అయితే ఈ దాడుల నేపథ్యం లో ఏసీబీ డిఎస్పి వై. రమేష్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదుల ఆధారంగా దాడులు జరిపామని, తనిఖీలకు సంభందించి పూర్తి నివేదిక వెలువడిన తర్వాత తదుపరి చర్యలపై స్పష్టత రానుందని తెలిపారు.

## విద్యార్థులకు వరి నాట్ల అనుభవం

# నేలతో నేస్తాలయ్యారు

**అన్నపురెడ్డిపల్లి, జూలై 18, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో గల ఎర్రగుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు వరి నాట్ల అనుభవాన్ని పొందారు. స్థానిక మోదుగుల కుంట చెరువు పరిసరాల్లో గల వరి పొలాల్లో నాట్లు వేసే కార్యక్రమంలో 7వ, 8వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పాఠశాల ఎకో క్లబ్ మరియు నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఎకో క్లబ్ ఇంచార్జి ఉపాధ్యాయులు సునంద రెడ్డి, సుశీల, ఎన్.జి.సి. ఇంచార్జి లకవత్ జయరాం ఆధ్వర్యంలో విద్యార్థులు చేతిలో మొలిచిన మొక్కలు పట్టుకుని భూమిలో నాటడం ప్రత్యక్షంగా అను



భవించగలిగారు. విద్యార్థుల్లో వ్యవసాయంపై ఆసక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ విద్యార్థులతో కలిసి వరి నాట్లు వేయడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులు క్షేత్రపరిశీలనల ద్వారా పాఠాలను లోతుగా అర్థం చేసుకుంటారు. ఉపాధ్యాయులు ఇటువంటి అనుభవాత్మక అధ్యయనాలను ప్రోత్సహించాలి," అని తెలిపారు. 6వ, 7వ, 8వ తరగతుల సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాల్లో వ్యవసాయ సంబంధిత విషయాలు ఉండటంతో, ఉపాధ్యాయురాలు సుశీల పాఠాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శంకర్ మహదేవన్, ఉపాధ్యాయులు బి. వేంకటేశ్వరరావు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శిరీష, ఖాసీం పాల్గొన్నారు.

# పాఠశాలల్లో , కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- DEO,MEO, టీచర్స్ , లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలి
- విద్యా రంగ సమస్యలు పరిష్కారం చేయకపోతే కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించుతాం
- పి డి ఎస్ య ఆధ్వర్యంలో నిరసన




**భద్రాచలం టౌన్, జులై 18 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను పరిష్కరించకుండా చేపట్టిన బడిబాట కార్యక్రమంతో విద్యా లక్ష్యాలు నెరవేరకుండా ప్రభుత్వ విద్య విధ్వంసానికి గురవుతుందని పి డి యస్ యూ రాష్ట్ర కమిటీ సభ్యులు మునిగేలా శివ ప్రశాంత్ , దండుగుల రామ్ చరణ్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు అన్నారు. పి డి యస్ యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భద్రాచలం పట్టణంలో కళాశాల, హైస్కూల్ వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం విద్యార్థులు పి డి యస్ యూ భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు కేవలం ఒకే ఒక్కరు ఉపాధ్యాయులు ఉండి పాఠ్యాంశాలు బోధిస్తున్న దౌర్భాగ్య పరిస్థితి ఉందని ఇద్దరు మాత్రమే టీచర్లు ఉన్న పాఠశాలు అనేక ఉన్నాయని వారు తెలిపారు. మూత్ర లలు,మరుగుదొడ్లు ఉపయోగాలు లేని పాఠశాలలు,రక్షిత మంచినీళ్లు లేని ఠశాలు,కంప్యూటర్లు లేని పాఠశాలలు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి పట్టింపు లేకుండా బడిబాట కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్న విద్యాశాఖ మంత్రి లేని దుస్థితి ఉందని అంతేకాకుండా రాష్ట్రంలో 29 జిల్లాలలో డీఈఓ పోస్టులు లేవని 539 మండలాలలో ఎంఈఓ పోస్టులు కేటాయించకుండానే విద్యా సంవత్సరం ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం విద్యార్థులు లేరనే సాకుతో 2000 పాఠశాలలను మూసి వేస్తున్నారని సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వ పాఠశాలను మూసివేస్తే ప్రభుత్వ విద్యను ఎవరు కాపాడుతారని అన్నారు. రాష్ట్రంలో అనేక పాఠశాలలలో విద్యార్థినీలకు టాయిలెట్ సౌకర్యం లేవని ఇంతటి దౌర్భాగ్య పరిస్థితిలో కాంగ్రెస్ పాలన ప్రజా పాలన ఏవిధంగా అవుతుందని వారు ప్రశ్నించారు. అప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మధ్యాహ్నం భోజన పథకంలో మెనూ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వారు డిమాండ్ చేశారు. కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మంచినీటి సమస్యని తరగతు గదులని ఆధారంగా పెంచాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంధ్య, రవళి, రామ్ చరణ్ పవన్ కళ్యాణ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## మాతృవియోగంలో ఉన్న రేగా కాంతారావును పరామర్శించిన పలువురు నాయకులు



**టేకులపల్లి,జూలై18,ప్రజాజ్యోతి :** పినపాక మాజీ శాసనసభ్యుడు,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుకు మాతృవియోగం జరిగింది.ఈ సందర్భంగా ఆయన కరకగూడెం మండలంలోని స్వగ్రామమైన కుర్నవల్లిలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సంజీవ్ నాయక్, మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లందు మండల అధ్యక్షుడు శీలం రమేష్, ఇల్లందుపట్టణ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబి, టేకులపల్లి ఉపాధ్యక్షులు చీమల సత్యనారాయణ,ఘాజి, సత్యనారాయణ,వసంత్ , లలిత్ ,ఉపేందర్,రఫీ, యాకయ్య, మౌనిక,భాగ్య,మాధర్సి, పరామర్శించారు.

## పైపులైన్ పగిలిన పట్టించు కొని అధికారులు

**పాల్వంచ(టౌన్),జులై. 18, ప్రజాజ్యోతి:** నెహ్రూనగర్ లో పైపులైన్ పగిలి ఉండడం వలన స్కూలు, కళాశాల,మరియు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు వర్షం పడిన్నపుడు ఆ పగిలిన గుంట కనబడక పోవడం వలన స్కూల్ కి వెళుతున్న పిల్లలు,కింద పడడం జరిగింది. కావున ఇక నైనా ఆదికారులు మరమ్మతులు చేయాలనీ ప్రయాణికులు, పాఠశాలలకు వెళుతున్న పిల్లలు వారి తల్లితండ్రులు,ఉపాధ్యాయులు కోరూతున్నారు.





## వెంకటాపురం-అలుబాక రహదారి ధ్వంసం మరమ్మతులకు వెంటనే చర్యలు తీసుకోవాలని



**భద్రాచలం టౌన్, జులై 18(ప్రజజాజ్యోతి) :** రాళ్లవాగు బ్రిడ్జి మరమ్మత్తుల వలన వెంకటాపురం నుండి అలుబాక వరకు రహదారిపై ఇసుక లారీలు తిరగడం వలన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడినట్లు తెలుగుదేశం పార్టీ నేతలు అన్నారు . ఈ గుంతల కారణంగా అంబులెన్స్‌లు, బస్సులు వంటి రవాణా వాహనాలు కూడా రోడ్డు మీద సాగలేని పరిస్థితి ఏర్పడిందని, రహదారి పూర్తిగా ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో, రహదారి మరమ్మతులకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం తెలుగుదేశం పార్టీ నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయం నందు ఏఓ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తాళ్లూరి చిట్టిబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు కొడాలి శ్రీనివాస్,కంభంపాటి సురేష్ కుమార్,కుంచాల రాజారాం,కొడాలి చంటి,రేపాక రాంబాబు,అబ్బినేని శ్రీనివాస్, కొండవీటి అశోక్, కానమిల్లి రాఘవ, వెంకటాపురం తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొనే బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



**బూర్గంపహాడ్,జూలై18(ప్రజా జ్యోతి) :** బూర్గంపహాడ్ మండలం గాంధీనగర్ గ్రామంలో గల శ్రీ సత్య సాయి మోడల్ స్కూల్ నందు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 100 స్కూల్ బ్యాగ్స్ ను శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాంబాబు, సెక్రెటరీ చాంద్ బాషా, చెంగల్ రావు,సాయిరామ్,ప్రవీణ్,ఐటిసి కాంట్రాక్టర్లు మహేష్ రెడ్డి, ఏసోబు,ప్రసాద్ పాల్గొన్నారు.

## మార్కెట్ అభివృద్ధికి సహకరించాలి



**ఇల్లందు, జులై 18, ప్రజాజ్యోతి :** రైస్ మిల్లర్లు, ట్రేడింగ్, ప్రాసెసింగ్ సంబంధించి తప్పనిసరిగా మార్కెట్ నుండి లైసెన్స్ పునర్ధరించుకొవాలని, మార్కెట్ అభివృద్ధికి సహకరించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు సూచించారు. శుక్రవారం రైస్ మిల్లర్ల యాజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మార్కెట్ నియమనిబంధనల ప్రకారం వ్యాపారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి సుచిత్ర, సూపర్వైజర్ శ్రీనివాస్, రైస్ మిల్లర్ల యాజమనులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి డైరెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే




**ఇల్లందు, జులై 18, ప్రజాజ్యోతి:** సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రును శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూల బొకే అందజేశారు. ఇల్లందులో నూతనంగా ప్రారంభించనున్న జెకె 5 ఓసి పొదగింపు ప్రాజెక్టు త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి ఇల్లందు వైస్ ప్రెసిడెంట్ జె. వెంకటేశ్వర్లు, నియోజకవర్గ నాయకుడు మడుగు సాంబమూర్తి, నాయకులు చిట్టిబాబు, పడిదల నవీన్, మాలోత్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలిగా చిట్టే లలిత ఏకగ్రీవ ఎన్నిక



**భద్రాచలం టౌన్, జులై 18(ప్రజాజ్యోతి ):** గ్రీన్ భద్రాద్రి మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలిగా చిట్టే లలితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.శుక్రవారం స్థానిక రెడ్ క్రాస్ బిల్డింగ్ నందు ప్రతిష్టాత్మక గ్రీన్ భద్రాద్రి 2025-2026 సంవత్సరానికి గాను నూతన అధ్యక్షురాలిగా చిట్టే లలిత, ప్రధాన కార్యదర్శిగా లకావత్ వెంకటేశ్వర్లు (ఎల్. వి ), కోశాధికారిగా పూసం రవికుమారి, వైస్ ప్రెసిడెంట్లుగా సుబ్రహ్మణ్యం, తుమ్మల రాణి, కో ఆర్డినేటర్ గా లాయర్ పామరాజు తిరుమలరావు, జాయింట్ సెక్రటరీగా కమ్మ వాణిరామ్ లను ఏకగ్రీవంగా ఎంపిక చేయటం జరిగింది. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ అధ్యక్షురాలుగా నియమించిన సంస్థ పెద్దలకి కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రీన్ భద్రాద్రి ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్తానని, భద్రాచలం పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా తీర్చి దిద్దటానికి తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షురాలు చిట్టే లలిత అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ యేగి సూర్యనారాయణ, మాజీ అధ్యక్షులు పల్లింటి దేశప్ప, బోనాల నాగ సూర్యనారాయణ, కామిశెట్టి కృష్ణార్జునరావు, ఎ. ఉమాశంకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలి : హరిప్రసాద్

- మంత్రి పొంగులేటికి టీఎస్టీయూసీ వినతి



బూర్గంపహాడ్, జూలై 18 (ప్రజా జ్యోతి) :సారపాకలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని టీఎస్టీయూసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం టిఎస్టి యుసి అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్ ఐటీసీ గెస్ట్ హౌస్ లో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తొలుత పొంగులేటిని శాలు వాతో ఘనంగా సత్కరించారు. మండలంలో రెండు ఎకరాలకు తగ్గకుండా స్థలం కేటాయిస్తే ఐటీసీ సంస్థతో మాట్లాడి ఈఎస్ఐ ఆసుపత్రి కట్టించేందుకు గుర్తింపు సంఘం బాధ్యత తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీలో వైద్యులు, మందులు అందుబాటులో ఉంచడంతో పాటు అంబు లెన్స్ అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కి ఆసుపత్రి కేటాయింపు విషయాన్ని చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులతో పాటు టీఎస్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి గాదె రామకోటిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు దుగ్గెంపూడి శేషిరెడ్డి పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ దేవాలయంలో హుండీ దొంగతనం



**అన్నపురెడ్డిపల్లి, జూలై 18, ప్రజాజ్యోతి :** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల మర్రిగూడెం గ్రామ శివారులోని ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయంలోని హుండీని పగలగొట్టి, అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన గ్రామస్థులు హుండీ ధ్వంసమైన పరిస్థితిని గమనించి, అధికారులకు సమాచారం అందించారు. హుండీలో సుమారు 15 వేల రూపాయలు నగదు ఉండి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యం

- భద్రాచలం నియోజక వర్గానికి అదనంగా 1500 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు
- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**భద్రాచలం ,జూలై 18,ప్రజాజ్యోతి :** మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని గిరిజన భవన్లో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ తో కలిసి పాల్గొన్నారు. సభ ప్రాంగణానికి విచ్చేసిన మంత్రికి మహిళలు ఘనంగా స్వాగతం పలిచారు. అనంతరం మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముందుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని మహిళా స్వయం శక్తి సంఘాల ద్వారా చేపడుతున్న పనులు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రగతి నివేదికలను వివరించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో మహిళల సాధికారత కోసం ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. వడ్డీ లేని రుణాలు, మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బీమా భద్రత పథకాలు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సబ్సిడీ బియ్యం వంటి పథకాలు నిజమైన సంక్షేమ పాలనకు నిదర్శనమని ఆయన వివరించారు. గత పాలనలో చెల్లించని 3750 కోట్ల పావల వడ్డీ బకాయిలు చెల్లించలేదని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఎర్పడిన తర్వాత 865 కోట్లు మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేశామని మంత్రి చెప్పారు. అంతేకాక, మహిళా సభ్యుల బీమా పథకాన్ని పునరుద్ధరించి, సహజ మరణానికి 2 లక్షలు, ప్రమాద మరణానికి 10 లక్షల బీమా కల్పించినట్లు వివరించారు. గత పాలనలో 18 నుండి 60 ఏళ్ల వయస్సు మహిళలకే స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం ఉండేది. ఇప్పుడు 15 నుండి 65 ఏళ్ల వయస్సు గల మహిళలకు సభ్యత్వ అవకాశాన్ని కల్పించడం ద్వారా లక్షలాది మంది లబ్ధిపొందుతారని అన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణం ప్రధాన లక్ష్యంగా తీసుకున్న ప్రభుత్వం, తొలి దశలో అశ్వరావుపేట నియోజకవర్గానికి 4,500 ఇళ్లను మంజూరు చేసింది. అలాగే, భద్రాచలం నియోజకవర్గానికి అదనంగా 1500 ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. రాబోయే మూడున్నర సంవత్సరాల్లో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. మహిళల అభివృద్ధికి దోహదపడేలా వెయ్యి సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, మహిళా సంఘాల పేరుపై బస్సుల కొనుగోలు వంటి ఆవిష్కరణాత్మక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులే ఇవ్వలేకపోయిందని, నేటి ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం రేషన్ కార్డుతో పాటు, ఆరోగ్యానికి హానికరమైన దొడ్డు బియ్యం స్థానంలో పోషక విలువలతో కూడిన సన్నబియ్యాన్ని అందించుతోందని మంత్రి అన్నారు. గిరిజన ప్రాంతాల్లో తాటాకు ఇళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రతి గూడెం కు విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో పేదల కష్టాలను తీర్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ..మహిళా సంఘాల ద్వారా భద్రాచలం ఖ్యాతి ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందిందన్నారు. భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని 390 మహిళ సమాఖ్య సంఘాల ద్వారా సుమారు 40000 మంది మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మహిళా శక్తి ద్వారా సమాజాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళల ద్వారా ఆర్టీసీ బస్సుల నిర్వహణ, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల కరెంటు వంటి సంక్షేమ పథకాలు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందెందుకు ఉపయోగపడుతున్నాయి అన్నారు. భద్రాచలంలోని గిరిజన మహిళలు తయారు చేసే రాగి మాల్ట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది అన్నారు. ఇందిర మహిళా శక్తి సంఘాల ద్వారా ఆహార పదార్థాలు తయారీతో భద్రాచలం నియోజకవర్గం ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గం లోని మహిళలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కలెక్టర్ అన్నారు. ఈ ప్రాంత మహిళలు తయారు చేసే ఆహార పదార్థాలు దేశంలోని ఇతర ప్రాంతాల మహిళలకు ఆదర్శప్రాయం అన్నారు. ప్రభుత్వం నేడు మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. రేషన్ కార్డుల మంజూరు, ఆర్థిక సహాయ పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలు వంటి వాటి ద్వారా ఇంట్లో ఉన్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపుతోంది అన్నారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగపరచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మహిళల పేరు మీదే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, రేషన్ కార్డులు, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సులు నిర్వహణ, 500కే గ్యాస్ బండ వంటి అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందని వాటిని ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది రాష్ట్రఅభివృద్ధికి దోహదపడాలని ఆయన అన్నారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అనంతరం భద్రాచలం నియోజకవర్గం పరిధిలోని 268 స్వయం సహాయక సంఘాలకు 17.64 కోట్లు, బ్యాంకు లింకేజీ ద్వారా 268 స్వయం సహాయక సంఘాలకు 17.64 కోట్లు మరియు లోన్ బీమా ద్వారా 17 మంది సభ్యులకు 22 లక్షల 49 వేల 230 రూపాయలు, లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో నాగలక్ష్మి, డి ఎస్ఓ రుక్మిణి, భద్రాచలం తాసిల్దార్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఊరు.. వాడ ..చల్లగాచూడు తల్లి

- అమ్మకు సారే, చీరా,128 రకాల ప్రసాదాలు, 18 రకాల పండ్లు పంపిన శ్రీ జ్ఞాన సాయిబాబా
- గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ
- ఆలయంలో అన్నదానం, ప్రత్యేక పూజలు





**అశ్వారావుపేట, జూలై 18, ప్రజాజ్యోతి:** ఊరు,వాడ చల్లగా చూడు తల్లి అంటూ మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలచెఱువు గ్రామంలో వేంచేసి ఉన్న మహిమాన్వితమైన శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాడమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకొని ఆలయకమిటీ ఆధ్వ ర్యంలో అత్యంత వైభవంగా ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించి అన్న దాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీసభ్యులు మాట్లాడుతూ స్వయంభువుగా వెలసిన కనకదుర్గమ్మ తల్లికి ఉదయం 6గంటల నుండి పంచామృ తాలతో అభిషేకాలు నిర్వహించామని అనంతరం ప్రత్యేక పూజలు, హారతులు ఇచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయకమిటీసభ్యులు, భక్తులుపాల్గొన్నారు. అమ్మవారికి సారే, చీర, పసుపు కుంకుమ, 128రకాల ప్రసాదాలు,18 రకాల పండ్లు పంపిన జ్ఞాన సాయిబాబా పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో ఉన్న శ్రీ జ్ఞాన సాయిబాబా మందిరం నుండి శ్రీషిర్డీ సాయి సేవాసమితి ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ అమ్మవారికి సారే.. చీర,పసుపు, కుంకుమ,128 రకాల స్వీట్లు 18 రకాల పండ్లు బాబా వారి తరపున అమ్మవారికి సేవాసమితి సభ్యులు సమర్పించారు. సాయిబాబా మందిరం వద్దనుండి మేళతాళాలతో అమ్మవారికి సమర్పించే సారేను మహిళ భక్తులు తమ తలపైనుంచి బస్టాండ్ సెంటర్లో ఉన్నశ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్దకు వచ్చి అక్కడ ప్రత్యేకపూజలునిర్వహించారు. అక్కడ నుంచి గుర్రాలచెరువు అమ్మవారి ఆలయానికి చేరి బాబావారి తరపున సారే, చీర,పసుపు, కుంకుమ ,ప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో షిర్డీసాయి సేవా సమితి అధ్యక్షులు పంబిహరిబాబు, లక్కిరెడ్డి కృష్ణరెడ్డి,పృధ్వి, రాజేష్, బమ్మిడి అప్పారావు,మలోత్ కుమారి,కన్నెబోయిన రమాదేవి, స్వప్న, శాంతకుమారి, మణి ,ఉమ,మల్లేశ్వరి, వరలక్ష్మి, సత్యవతి, లక్ష్మి, జ్యోతి,శ్రావణి, తదితరులుపాల్గొన్నారు.

# మాడవీధుల విస్తరణ పనులు వేగవంతం చేయాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**భద్రాచలం ,జూలై 18,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న మాడవీధుల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం , పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు స్పష్టం చేశారు.శుక్రవారం భద్రాచల పర్యటనలో భాగంగా మంత్రి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాడవీధుల అభివృద్ధి ప్రణాళిక, ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం మంత్రి మాట్లాడు తూ, భద్రాచల రామాల యం రాష్ట్రానికి ఆధ్యాత్మికంగా అత్యంత ప్రాధాన్యమున్న స్థలం. ఇక్కడికి వేలాదిగా భక్తులు వస్తారు. వారి కోసం చేపడుతున్న మాడవీధుల విస్తరణను ఏ మాత్రం ఆలస్యం చేయకూడదు. పనులు వేగవంతంగా పూర్తి చెయ్యాలి అని అన్నారు.మాడవీధుల విస్తరణలో భాగంగా పరిహా రం ఇచ్చిన ఇండ్లను తక్షణమే తొలగించాలని,ప్రజలతోసంప్రదించి శాంతియుతంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీనితో పాటు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఈ ప్రణాళిక భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలకు మార్గదర్శకంగా ఉండేలా రూపొం దించాలన్నారు.మంత్రి పర్యటనలో జిల్లా అధికారులు, పంచాయతీ సిబ్బంది, ఆలయ ప్రతినిధులు, వివిధ శాఖల ఇంజినీర్లు పాల్గొన్నారు.

# మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు

- ప్రధాని నోట భద్రాచలం పేరు రావడం గొప్పవిషయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**భద్రాచలం ,జూలై 18,ప్రజాజ్యోతి :** ఆదివాసి గిరిజన మహిళలు ఇంటిపట్టునే ఖాళీగా ఉండకుండా స్వసక్తితో జీవనాధారం పెంపొందించుకోవడానికి చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని ఇంటికి అవసరమైన వస్తువులు తయారు చేసి వాటిని అమ్మకాలు జరుపుకోవడమే కాక ఐటీడీఏ ఎం ఎస్ ఎం ఈ గ్రూప్ మహిళలు తయారు చేసిన మిల్లెట్ బిస్కెట్ల ఘనత లండన్ వరకు చేరుకొని ప్రధాని నోట మన భద్రాచలం పేరు రావడం ఎంతో గొప్ప విషయం అని, మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, మాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో నిర్వహించిన ఇందిరమ్మ రేల మహిళా శక్తి సంబరాలు కార్యక్రమం సందర్భంగా వివిధ మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి మహిళలు వారే సొంతంగా తయారుచేసిన ఆరు రకాల సబ్బులు షాంపూలు, మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్లు, ఇతర రకాల పచ్చళ్ళు, న్యూట్రి మిక్స్, న్యూట్రి డ్రైమిక్స్, రాగి జావా, జొన్న జావా తయారుచేసి ప్రజలకు సరసమైన ధరలకు అమ్మకాలు జరుపుకోవడానికి అవకాశం ఇచ్చి గిరిజన మహిళలకు ఉపాధి కల్పించడం చాలా సంతోషకరమని ఆయన అన్నారు. వారు తయారు చేసిన వస్తువులు ప్రతి ఒక్కరు కొనుగోలు చేసి వారి జీవన భృతికి తోడ్పాటు అందించాలని అన్నారు. వారు తయారు చేసే సబ్బులు షాంపూలు వివిధ రకాల ఔషధ గుణాలు కలిగిన వనమూలికలు కలిపి శరీరానికి ఎటువంటి రుగ్మతలు రాకుండా అన్ని పదార్థాలు సమపాలల్లో కలిపి తయారు చేస్తారని అటువంటి ఔషధ గుణాలు కలిగిన వస్తువులు ఇంటిల్లిపాది వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన అన్నారు. భద్రాద్రి శ్రీరామ జాయింట్ లీయబిలిటీ మహిళా గ్రూపు సభ్యులు, శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లియాబిలిటీ మహిళాగ్రూప్ సభ్యులు, ఓం శక్తి మహిళా ప్రొడక్ట్స్, భద్రాద్రి మిల్లెట్, లక్ష్మీ గణపతి, దమ్మక్క జాయింట్ లియాబిలిటీ గ్రూప్ సభ్యులు రాగి, సజ్జలు, కొర్రలు మరియు ఇతర న్యూట్రిషన్ పదార్థాలతో తయారు చేసే మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డూలు, మునగ, కరివేపాకు కారంపొడి, మామిడికాయ, గోంగూర పచ్చళ్ళు అమ్మకాలు జరుపు కుంటున్నారని, వీరు అమ్మకాలు జరుపుకోవడానికి దేవస్థానం ప్రాంగణం, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, ఐటీడీఏ కార్యాలయం అవకాశం ఇవ్వడమే కాక వీరికి మార్కెట్ సౌకర్యం కల్పించడానికి కృషిచేసిన ఐటీడీఏ పీవో కు అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు.అనంతరం వారు తయారు చేసిన సబ్బులు షాంపూలు ఇతర వస్తువులు, మిల్లెట్ బిస్కెట్లు,



ఇప్పపు లడ్లు మహిళలు మంత్రివర్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ మహిళలు వెంకటలక్ష్మి, సమ్మక్క, లలిత, సున్నం ఈశ్వరి,సున్నం స్వాతి,వసుంధర, జగ్గా కుమారి, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు స్వర్ణకవచాలంకరణ



**భద్రాచలం కల్చరల్ , జూలై 18,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారుచేయించి సమర్పించిన సర్వాం గ స్వర్ణ కవచాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్య బలిహరణం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణ మూర్తులకు బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యా ణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

# ఈనెల 21న జరిగే భారత జాతీయ మహిళా (ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ) సభలను జయప్రదం చేయండి



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 18, ప్రజా జ్యోతి :** భారత జాతీయ మహిళా సమాఖ్య( ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ) మహాసభలు పాల్వంచ పట్టణంలోని ఈనెల 21 న నిర్వహించినట్లు భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీసంశెట్టి పద్మజ తెలిపారు, శుక్రవారం పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు మహిళలపై జరుగుతున్న వేధింపులు, హత్యలు, అత్యాచారాలు రకరకాల హింసలు పెరిగిపోతున్నాయని.భారత రాజ్యాంగంలో మహిళలకు అనేక రకాల హక్కులు ఉన్నప్పటికీ, ఈ మధ్యకాలంలో నిర్భయ, దిశ చట్టాలు వచ్చినప్పటికీ మహిళలకు భద్రత కరువైందని.పాలక ప్రభుత్వాలు చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్లనే ఈ హింస ఇంకా పెచ్చరిల్లుతున్నదన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు బల మైన ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని.,మహిళల హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రజా పోరాటాలను నిర్వహిస్తూ ఎన్నో విజయాలు సాధించిన భారత జాతీయ మహిళ సమాఖ్య పాల్వంచ మండల, పట్టణ 5వ.మహాసభలు ఈనెల 21న పాల్వంచలో జరగనున్నాయని. ఈ మహా సభలకు పాల్వంచ మండల, పట్టణ ప్రాంతాల్లోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకురాలు వగ్గెల పద్మ, డి లక్ష్మి, వై ప్రభావతి,సంధ్య, జి పద్మ, కే. ఈశ్వరమ్మ, వై మేరమ్మ, ఆర్ హేమలత,వాడే లక్ష్మి ,కే స్వర్ణలత,వజ్జా.రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం



**భద్రాచలం టౌన్, జూలై 18(ప్రజాజ్యోతి ):** బ్యాంక్ ఆఫ్ బరోడా స్థాపించి 118 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా, భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో స్థానిక వృద్ధాశ్రమంలో శుక్రవారం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా వృద్ధులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. బ్యాంక్ సిబ్బంది వృద్ధులను పరామర్శించి, వారికి అవసరమైన వస్తువులను అందజేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు బ్యాంక్ అధికారులు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న బ్యాంక్ సిబ్బందిని స్థానికులు ప్రశంసించారు